ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ 3
శనివారం 19 జులై 2025
జిల్లాల వార్తలు

ఆదర్శ ఉపాధ్యాయులు
● పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన టీచర్లు 5
● ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్యఅందుతుందనే భరోసా

తరగతి గదిలోనే కుప్పకూలిన ఉపాధ్యాయుడు 4
● సిద్దిపేట జిల్లా పీర్లపల్లిలో గుండెపోటుతో టీచర్ మృతి

స్కూల్ ఎదుట ఏబీవీపీ ఆందోళన 4
● బస్సు అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం

దుర్గమ్మ తల్లి జాతరలో జగ్గారెడ్డి జోష్


సంగారెడ్డి దుర్గమ్మ తల్లి జాతరలో పోతరాజు నృత్యాల్లో జగ్గారెడ్డి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి)
సంగారెడ్డిలోని దుర్గమ్మ తల్లి జాతర శుక్రవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొని జోష్ నింపారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల నృత్యాల నడుమ ఏర్పులామె రంగం చదివి వినిపించింది. అనంతరం భక్తుల కోలాహలం మధ్య జగ్గారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో వర్షాలు కురుస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పేదలు, బడుగు బలహీనవర్గాలకు మంచి రోజులు వచ్చాయని చెప్పారు. ఈ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తోపాజి అనంతకిషన్, కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


భక్తులతో పాటు రంగం వింటున్న జగ్గారెడ్డి

కుంటల ఆక్రమణపై చర్యలు తీసుకోండి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


నీటిపారుదల చీఫ్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు/రామచంద్రాపురం టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు మండలంలోని పాషమైలారం ప్రాంతంలో ఆక్రమణకు గురైన కుంటలను పరిరక్షించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్, నీటి పారుదల చీఫ్ ఇంజనీర్ అహ్మద్‌హుస్సేన్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. పాశమైలారం రెవెన్యూ పరిధిలోని కొత్తకుంట, పాపాయిగూకుంట, గొల్లవాని కుంట, ఆరోటోనికుంట, వడ్లకుంటలు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయని, 39 ఎకరాల భూమి కబ్జాకు గురైందని ఆయన పేర్కొన్నారు. వరద నీరు ప్రవహించకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రామచంద్రాపురం లింగంపల్లి కూడలిలో బెల్ ఫ్లైఓవర్ వద్ద వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించాలని జాతీయ రహదారుల అభివృద్ధి ఆర్వో కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

'పీఎం-ఉషా'తో మహర్దశ

సంగారెడ్డిలోని మహిళా డిగ్రీ కళాశాలకు రూ.5 కోట్ల కేంద్రం నిధులు

తరగతి గదులు, హాస్టల్ భవనం నిర్మాణం.. సాంకేతిక విద్య, సౌకర్యాల కల్పన

స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు తొలిసారి పరిచయం


సంగారెడి మహిళా డిగ్రీ కళాశాలలో నిర్మిస్తున్న అదనపు గదులు

సంగారెడ్డి అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలు పెంచడం, విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడం, విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్(పీఎం-ఉషా)పథకాన్ని అమలు చేస్తున్నది. గ్రామీణ ప్రాంతాల, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు కూడా ఉన్నత విద్య మరింత చేరువ చేయాలనే లక్ష్యంగా ఈ పథకం పనిచేస్తున్నది. ఇందులో భాగంగా 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి పీఎం-ఉషా పథకానికి సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎంపికైంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ఏకైక ఈ మహిళా డిగ్రీ కళాశాల పీఎం-ఉషా పథకానికి ఎంపిక కావడం గమనార్హం.

రూ.5 కోట్లు మంజూరు

పీఎం-ఉషా పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరి చేసింది. ఇందులో రూ.4.57 కోట్ల నిధులు భవనాల నిర్మాణాలకు, రూ.30 లక్షలు సాంకేతిక విద్యకు, రూ.10 లక్షలు కళాశాల పాత భవనాల మరమ్మత్తులు, రూ.3 లక్షలు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు ఆరంభానికి కేటాయించారు.

అదనపు తరగతులు, హాస్టల్ గదులు

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలోనే అదనంగా పది తరగతి గదులు, నాలుగు గదులతో కూడిన హాస్టల్ భవనాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఆయా గదుల నిర్మాణ పనులు ప్రారంభం కాగా, వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంగా నిర్దేశించారు. నిర్మాణ బాధ్యతలను టీజీఈడబ్ల్యూఐడీసీకి అప్పగించారు. పనులు పూర్తయితే తరగతి గదుల కొరతతో పాటు హాస్టల్స్ లేమి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ఈ కళాశాల విద్యార్థినులకు ఇక్కట్లు తొలగనున్నాయి.

స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు

సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 9.25 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నది. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో సుమారు 250 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ కళాశాలలో వివిధ వర్గాలకు చెందిన మహిళా విద్యార్థినులు విద్యనభ్యసిస్తుంటారు. మూడేళ్ల డిగ్రీ కోర్సు తర్వాత సొంత కాళ్లపై నిలబడాలనే ఉద్దేశ్యంలో 90 రోజుల స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు తొలి సారి అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. మగ్గం వర్క్స్, టైలరింగ్, బ్యూటిఫికేషన్, మెహిందీ, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు అవసరమైన సామగ్రి కొనుగోలు, శిక్షకుల నియామకానికి రూ.3 లక్షలు వెచ్చించనున్నారు.

రూ.30 లక్షలతో సామగ్రి కొనుగోలు

పీఎం-ఉషా కింద రూ.30 లక్షల నిధులతో 30 కంప్యూటర్లు, 10 డిజిటల్ స్మార్ట్ బోర్డులు, ల్యాబ్ కెమికల్స్ మూడు ఫ్రిడ్జ్‌లు, వంద

మిగతా 6వ పేజీలో


సదాశివపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు (ఫైల్)

ఏసీబీ.. దూకుడు

జహీరాబాద్‌లోని నిమ్జ్ కార్యాలయంలో న్యాల్‌కల్ మండలం హుగ్గెల్లికి చెందిన ఓ రైతు నుంచి డబ్బులు తీసుకుంటున్న డిప్యూటీ కలెక్టర్ రాజిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, డ్రైవర్ దుర్గయ్యను ఏసీబీ అధికారులు ఈ నెల 9న పట్టుకున్నారు. న్యాల్‌కల్ మండలం హుగ్గెల్లికి చెందిన ఓ రైతు భూమిని నిమ్జ్ కోసం సేకరించారు. ఇందుకు పరిహారం డబ్బులు విడుదల చేసేందుకు రూ.5లక్షలు ఇవ్వాలని నిమ్జ్ అధికారులు డిమాండ్ చేశారు. పరిహారం చెక్కు రైతు ఖాతాలో జమ కాగానే లంచం కోసం ఒత్తిడి తెచ్చారు. దీంతో సదరు రైతు ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచన మేరకు లంచం ఇచ్చేందుకు ఒప్పుకున్న రైతు.. డ్రైవర్ దుర్గయ్యకు రూ.65వేలు ఇచ్చాడు. దుర్గయ్య ఈ మొత్తంలో డిప్యూటీ కలెక్టర్‌కు రూ.50వేలు, డిప్యూటీ తహసీల్దార్‌కు రూ.15వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

కాళేశ్వరం మాజీ ఈఎన్సీ మురళీధర్‌రావుపై ఏసీబీ పంజా విసిరింది. గత మంగళవారం ఏకకాలంలో 12 చోట్ల సోదాలు నిర్వహించారు. ఆయనకు జహీరాబాద్‌లో 2 కేవీ సోలార్ ప్లాంట్ ఉన్నట్లు గుర్తించారు. అది కాకుండా కొండాపూర్‌లో ఒక విల్లా, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ, బేగంపేట, కోకాపేట, కరీంనగర్, కోదాడ, వరంగల్, మోకిలాలో ఇళ్లు, స్థలాలు, భూములు, నగదు, బంగారం, బ్యాంకు డిపాజిట్లు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. వీటి విలువ రూ. ఆరు వందల కోట్లకు పైగానే ఉన్నట్లు అంచనా వేశారు.

లంచావతారులపై ఉక్కుపాదం
కొన్ని శాఖలపై ప్రత్యేక నజర్
వల పన్ని పట్టుకుంటున్న ఏసీబీ అధికారులు
అయినా.. మారని తీరు
రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి ఊడలు
అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు
అవినీతిపై ఫిర్యాదుకు టోల్ ఫ్రీ నంబర్ 1064

సంగారెడ్డి క్రైం/సదాశివపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆ మాత్రం దూకుడు లేకపోతే.. పోలీసోడికి.. పోస్టుమెన్‌కి తేడా ఏముంది.. అని ఓ తెలుగు సినిమాలో డైలాగ్ ఉంటుంది. ఈ డైలాగ్ ఏసీబీ అధికారులకు సరిగ్గా సరిపోతోంది. అదే మాదిరిగా సంగారెడ్డి జిల్లాలో ఏసీబీ అధికారులు అవినీతిపరులపై దూకుడు పెంచారు. ప్రభుత్వ శాఖల్లో రాజ్యమేలుతున్న లంచావతారులపై ఉక్కుపాదం మోపుతూ పాతుకుపోయిన అవినీతి ఊడలను పీకి పారేస్తున్నారు. అవినీతికి సంబంధించిన సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ ప్రజల్లోకి తీసుకెళ్తోంది. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెరుపు దాడులు చేస్తున్నారు. ఈ ఏడాది ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏసీబీ అధికారులు ఏడు కేసులు నమోదు చేసి తొమ్మిది మంది అవినీతిపరులను అరెస్టు చేశారు.

రెవెన్యూ, రిజిస్ట్రార్ కార్యాలయాలపై ప్రత్యేక నిఘా

ప్రభుత్వ శాఖల్లోని అవినీతిపరుల గుండెల్లో ఏసీబీ గుబులు పుట్టిస్తోంది. ముఖ్యంగా రెవెన్యూ, రిజిస్ట్రార్, పంచాయతీ రాజ్ శాఖలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలకు అవసరమయ్యే పౌర సేవలను ఉచితంగా పొందాలే తప్ప లంచంతో కొనవద్దని ఏసీబీ అధికారులు అనేక సందర్భాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నప్పటికీ, అనేక శాఖల్లో ముడుపులు ముట్టనిదే ఏ పనీ జరగడం లేదని తెలుస్తోంది. ప్రతీ ఫైలుకు ఓ రేటు ఫిక్స్ చేసి, అడిగినంత లంచం ఇవ్వనిదే ముందుకుసాగని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రెవెన్యూ, రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి రాజ్యమేలుతోంది. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ముడుపులివ్వనిదే ఎటువంటి పనైనా జరగడం లేదు. భూముల క్రయవిక్రయాల నుంచి భూములకు సంబంధించిన ఏ డాక్యుమెంట్ కావాలన్నా డబ్బులు ముట్టచెప్పాల్సిందే. ఆయా శాఖల్లో అధికారులు దళారులను నియమించుకొని డబ్బులు దండుకుంటున్నారు. అవినీతి దందా ఇతరుల కంట పడకుండా సీసీ కెమెరాలను పనిచేయకుండా చేస్తున్నారు. కేవలం అలంకార ప్రాయంగానే సీసీ కెమెరాలు దర్శనమిస్తున్నాయి.

గత రెండేళ్లలో ఉమ్మడి జిల్లాలో ఏసీబీ కేసులు

ప్రభుత్వ శాఖ	2024	2025
టీఎస్‌సీపీడీసీఎల్	0	1
మున్సిపల్	2	1
పోలీసు	3	1
వ్యవసాయ	1	0
రెవెన్యూ	3	4
పంచాయతీరాజ్	2	2

ఆగని అవినీతి

రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ జిల్లా పంచాయతీ కార్యాలయం, ట్రాన్స్‌కో, రిజిస్ట్రేషన్లు తదితర శాఖల్లో అవినీతి భారీగా జరుగుతున్నట్టు ఆయా శాఖల్లో లంచం తీసుకుంటూ పట్టుబడుతున్న ఉద్యోగులను బట్టి తెలుస్తోంది. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు శాఖలో కూడా కొందరు పోలీసులు లంచాలు తీసుకుంటూ మొత్తం పోలీసు శాఖకే మచ్చ తెస్తున్నారు. అయితే ప్రభుత్వ శాఖల్లో దాదాపు 90 శాతం మంది లబ్ధిదారులు తమ పనులను అవినీతి అధికారులకు లంచం సమర్పించుకొని పూర్తి చేయించుకుంటున్నారు. ఇక లంచం ఇవ్వలేనివారికి సంబంధించిన ఫైళ్లల్లో

మిగతా 6వ పేజీలో

'కస్తూర్బా'లో నీటి కష్టాలు

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి కస్తూర్బా విద్యాలయంలో నీటి కటకట నెలకొన్నది. ఇక్కడ 331 మంది విద్యార్థినులు చదువుతున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో రెండ్రోజులుగా నీటి కొరతతో స్నానాలు కూడా చేయడం లేదు.
-రామయంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి)



డిజిటల్ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

● ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి త్వరలో ఉచిత ఇసుక
● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య


సర్వేను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

వట్‌పల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ సర్వేతో రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. షాద్‌నగర్‌లో శుక్రవారం నిర్వహిస్తున్న భూభారతి డిజిటల్ సర్వేను పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సమస్యలను పరిశీలించేందుకే డిజిటల్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని షాద్నగర్‌లో సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో డిజిటల్ సర్వే అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఇందిరమ్మ గృహాలను అర్హులైన లబ్ధిదారులు ఉచితంగా ఇసుక సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు


ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకుంటున్న రామచందర్‌రావు, రఘునందన్‌రావు

మెతుకు సీమ నుంచే విజయ యాత్ర

వనదుర్గామాతను దర్శించుకోవడం సంతోషకరం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

పాపన్నపేట/కొల్చారం/చేగుంట/గుమ్మడిదల/నర్సాపూర్/తూప్రాన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) ప్రకృతి ఒడిలో కొలువుదీరిన వన దుర్గ మాత దర్శనం తనకేంతో ప్రత్యేకమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పేర్కొన్నారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వన దుర్గ మాతను శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. అంతకు ముందు ఆయనకు దారి పొడవునా ఆయా మండలాల నాయకులు స్వాగతం పలికారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డితో పాటు మండల నాయకులతో కలిసి ఆయన ఏడుపాయల చేరుకున్నారు. ఆలయ ఈవో ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం మెతుకు సీమ నుంచే శుభారంభం అవుతుందన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు కావలి ఐలేష్, మండలం మహిళా మోర్చా అధ్యక్షురాలు సారా సుజలక్ష్మి, నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్ రమణ, మాజీ కౌన్సిలర్లు రాజేందర్, సురేష్, బుచ్చేస్‌యాదవ్, యాదగిరి, లతరమేష్‌యాదవ్ తూప్రాన్ మండల నాయకులు మధుసూదన్ రెడ్డి, యాదాగౌడ్, రాంమోహన్‌గౌడ్, పురం మహేశ్, జానకీరాంగౌడ్, నర్సోజీ, చేగుంట మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముసురేసింది

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో మోస్తరు వర్షాలు

సంగారెడ్డి రూరల్/వెల్దుర్తి/నారాయణఖేడ్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. పలు మండలాల్లో శుక్రవారం సాయంత్రం ఆకాశంలో దట్టమైన మేఘాలు ఆవరించి వర్షం కురిసింది. మెదక్ జిల్లా కేంద్రంతో పాటు, కొల్చారం, హావేళిఘనపురం, తూప్రాన్, అల్లాదుర్గం, చిన్న శంకరంపేట, చిలప్‌చేడ్, నిజాంపేట, వెల్దుర్తి, రామాయంపేట, నర్సాపూర్ తదితర మండలాలలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సంగారెడ్డి జిల్లాలో ఝరాసంగం, జిన్నారం, కోహీర్, నాగల్‌గిద్ద, వట్‌పల్లి, మాచునూర్, మేరపల్లి, కంది, సంగారెడ్డి మండలాల్లోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. ఝరాసంఘం మండలం ప్యాలవరం, మేరపల్లి గ్రామ సమీపంలోని వాగులు పొంగిపొర్లగా మాచునూర్ శివారులో సోయా పంటలో వర్షపు నీరు నిలిచింది. అదేవిధంగా నారాయణఖేడ్, జహీరాబాద్, గుమ్మడిదల, కంది, సంగారెడ్డి మండలాల్లోని పలు గ్రామాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో భారీ వర్షం కురువడంతో వర్షపు నీటితో రోడ్లు జలమయమయ్యాయి. వర్షం నీరు వ్యాపార కేంద్రాల ముందు నిలిచిపోవడంతో వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


ఝరాసంగం మండలం ప్యాలవరంలో పొంగిపొర్లుతున్న వాగు

పోలీసుల ప్రతిభ వెలికి తీయాలి: ఎస్పీ



డాగ్ స్క్వాడ్ పరీక్షలు

సంగారెడ్డి క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పోలీసుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జోనల్ డ్యూటీ మీట్‌ను ప్రారంభించారు. గత నెలలో నిర్వహించిన జిల్లా స్థాయి డ్యూటీ మీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయిలో ఎంపిక కోసం సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందిన 58 మంది అధికారులు, సిబ్బంది, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీంలకు జోనల్ స్థాయి డ్యూటీ మీట్ నిర్వహించారు. ఇందులో ఎంపికైన వారు ఈనెల 26న వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌లో పాల్గొంటారు. ఈసందర్భంగా ఎస్పీ పంకజ్ మాట్లాడుతూ.. నేరం జరిగిన తర్వాత నేరస్థలాన్ని ఏ విధంగా ప్రొటెక్ట్ చేయాలి, నేర స్థలంలో క్లూస్ ఏ విధంగా సేకరించాలి, కంప్యూటర్ పరిజ్ఞానం, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ పనితీరుపై పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఈనెల 26న వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌లో జిల్లా పోలీసులు సత్తా చాటాలన్నారు. పోలీసుల పనితీరుకు అద్దం పట్టే విచారణలో మెలకువలను నేర్చుకోవాలని సూచించారు. సరైన పద్ధతిలో కేసులు దర్యాప్తు చేస్తే ప్రజల్లో పోలీసుల పట్ల మరింత నమ్మకం పెరుగుతుందన్నారు.

ఆధార్ సెంటర్ ఎక్కడ..?



గుమ్మడిదల మున్సిపాల్టీ కార్యాలయం

- ● మున్సిపాలిటీగా మారినా మోక్షం లేదా?
- ● ఆరేళ్లుగా ఆధార్ సెంటర్ లేక ఇబ్బందులు
- ● ప్రజల ఇబ్బందులు పట్టించుకోని అధికారులు

గుమ్మడిదల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు మున్సిపాలిటీ పరిధిలో కొన్ని సంవత్సరాలుగా ఆధార్ సెంటర్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తమ అవసరాల కోసం, పిల్లల చదువుల కోసం ఆధార్ తప్పనిసరి అని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రజలు ఆధార్ కోసం నానా తిప్పలు పడుతున్నారు. మున్సిపాలిటీగా గుమ్మడిదల ఏర్పాటు చేసినప్పటికీ ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆధార్ కోసం రోజు పక్క జిల్లా మెదక్, మేడ్చల్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆరు సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల చదువులు, పెన్షన్లు, గ్యాస్ సబ్సిడీలు, బ్యాంకు ఖాతా తెరిచే పని ఏ అంశానికైనా ఆధార్ అవసరం. నిత్యం పనికి వెళ్లే కార్మికులు, కూలీలు తమ రోజువారీ ఆదాయాన్ని కోల్పోయి మెదక్, మేడ్చల్ వంటి జిల్లాలకు వెళ్లి ఆధార్ సర్వీసుల కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. ఆధార్ కేంద్రం లేకుండా ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గుమ్మడిదలలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ తహసీల్దార్ పరమేశానికి స్థానిక నాయకులు, ఆకుల ఆంజనేయులు, పలువురు వినతి పత్రం సమర్పించారు. తక్షణమే ఆధార్ ఏర్పాటు కోసం జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ పరమేశం హామీ ఇచ్చారు.

దేవస్థానానికి లాకర్ అందజేత



ఈవో అన్నపూర్ణకు లాకర్ అందిస్తున్న డిప్యూటీ జనరల్ మేనేజర్ భువనేశ్వరి

కొమురవెల్లి, జూలై18(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానానికి ఎస్‌బీఐ కొమురవెల్లి శాఖ లాకర్‌ను అందజేశారు. రూ.1,50,000 ల విలువ చేసే లాకర్‌ను శుక్రవారం ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ భువనేశ్వరి చేతుల మీదుగా ఆలయ ఈవో అన్నపూర్ణకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో శ్రీనివాస్,ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఎస్‌బీఐ సిద్దిపేట రీజినల్ మేనేజర్ కె.మారుతి, కొమురవెల్లి బ్రాంచ్ మేనేజర్ అర్జున్,ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వన దుర్గమ్మకు ఆషాఢ బోనం..

పాపన్నపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): వన దుర్గా మాతకు ఆషాడ బోనాలను సమర్పించి అదనపు కలెక్టర్ నగేష్ కుటుంబ సభ్యులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో ఏడుపాయలకు చేరుకున్న ఆయన కుటుంబ సభ్యులు బోనాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరంమేళ తాళాల చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి బయలుదేరారు. అమ్మవారికి బోనాలు వొడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు, ఆలయ కార్యనిర్వహణ అధికారి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, మరియు రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యా, సంక్షేమానికి ప్రభుత్వం కృషి



నార్సింగ్ పాఠశాలలో విద్యా బోధన చేస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

చేగుంట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తుందని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం నార్సింగ్ మండలంలో పలు గ్రామాల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో విద్యార్థులను చేర్పించి ప్రభుత్వ పాఠశాల, కళాశాలల సంక్షేమానికి పాటుపడాలని తల్లిదండ్రులు సహకరించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులను కూలీల కోసం పిల్లలను కళాశాలకు పాఠశాలకు పంపించకుండా వ్యవసాయ పనులను మాన్పించాలని తల్లిదండ్రులకు తెలిపారు. పాఠశాలలో, కళాశాలలో ఉపాధ్యాయులు అధ్యాపకులు మెదక్ జిల్లాలను ఉన్నత స్థానంలో నిలపాలన్నారు. అనంతరం మండలంలోని వల్లూరు గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీవో ఆనంద్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఎదుట ఏబీవీపీ ఆందోళన

● బస్సు అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం

కొండాపూర్,జూలై 18(ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ కార్యకర్తలకు ఓ స్కూల్ యాజమాన్య సిబ్బందికి తోపులాట జరిగింది. స్కూల్ బస్సు అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం అయిన సంఘటనలో ఏబీవీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సై సోమేశ్వరి కథనం ప్రకారం.. శుక్రవారం ఏబీవీపీ కార్యకర్తలమని స్కూల్‌లోకి ప్రవేశించి విద్యార్థులచే సభ్యత్వ నమోదు చేయించాలని సిబ్బందిపై వత్తిడి తెచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో యాజమాన్యం, సిబ్బందికి కార్యకర్తల మధ్య మాట మాటా పెరిగి తోపులాటకు దారి తీసింది. దీంతో కార్యకర్తలు స్కూల్ ఫర్నీచర్, బస్సు అద్దాలను ధ్వసం చేసిన సమాచారంతో కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమతులు లేకుండా ఇంటర్నేషన్‌ల్ పేరుతో స్కూల్ నడుపుతూ విద్యార్థులను మోసం చేస్తున్నారని ఏబీవీపీ సభ్యులతో కలిసి స్కూల్ ముందు అందోళన దిగామని విభాగ్ కన్వీనర్ అకాశ్ తెలిపారు. విద్యార్థులకు అధిక ధరలకు స్కూల్ డ్రెస్, పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నారని అందోళన చేపటాం. దీంతో విచక్షణ కోల్పోయి స్కూల్ యాజమాన్యం, సిబ్బంది దాడికి దిగారని అరోపించారు.

బంగారు పతకం సాధించిన శిల్పకు సన్మానం

నారాయణఖేడ్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణానికి చెందిన మలమంచి శిల్ప కుటుంబ బాధ్యతలు మోస్తూనే చదువు కొనసాగిస్తూ నిజామాబాద్‌లోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో బీఎడ్‌లో ప్రతిభ చూపి బంగారు పతాకాన్ని సాధించడం అభినందనీయమని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ సంగారెడ్డి రీజియన్‌కార్యదర్శి నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఖేడ్‌లో సంస్థ తరఫున గురురాజశర్మ, శిల్ప దంపతులను శాలువాలతో సన్మానించారు.

ప్రతి ఇంటి వద్ద పరిశుభ్రతను పాటించాలి

చిన్నశంకరంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఇంటి వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ వెంకటయ్య అన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిన్నశంకరంపేట మండల పరిధిలోని అంబాజీపేట గ్రామంలో పలువురు అధికారులు పర్యటించి ఇంటింటికి వెళ్లి స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పాత కుండీలు, పాత టైర్లు, పాత డబ్బాలను తొలగించి, నిల్వ ఉంచిన నీటిని పారబోశారు. వర్షాకాలం నేపథ్యంలో పలు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కుండీలలో నీటిని నిల్వ ఉంచరాదని ఆయన అన్నారు. నీరు నిల్వ ఉండటంతో దోమలు తయారవుతాయని, దీంతో ప్రజలు రోగాల బారిన పడి ఇబ్బందులు పడతారని తెలిపారు. స్వచ్ఛతపై ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణపై సిబ్బందికి పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఏఎన్ఎం యాదమ్మ, పంచాయతీ కార్యదర్శి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

600 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత

మునిపల్లి, జూలై18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద శుక్రవారం మునిపల్లి పోలీసులు 600గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బీదర్‌లో ఇరానీ గల్లీలో ఎండు గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్ తరలిస్తున్నారన్న సమాచారంతో మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద ఎస్సై రాజేష్ నాయక్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో స్కూటీపై వెళ్తున్న వారిపై అనుమానం రావడంతో ఆపి తనిఖీ చేసి విచారించారు. వారి వద్ద 600గ్రాముల (ఎండు గంజాయిని) ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నాందేడ్ జిల్లాకు చెందిన అజింకే పండరి, వీరబోయిన శ్రీకాంత్‌లు బీదర్‌లోని ఇరానీ గల్లీకి చెందిన ఇర్ఫాన్ అనే వ్యక్తి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన ఎండు గంజాయితో పాటు స్కూటీని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు.

దాడికి పాల్పడ్డ వ్యక్తుల అరెస్ట్

కొమురవెల్లి, జూలై18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలంలోని అయినపూర్ గ్రామానికి చెందిన ఆలేటి రాంరెడ్డిని పోలీస్ స్టేషన్‌లో కారుతో ఢీకొట్టిన వ్యక్తితో పాటు, వైన్స్ పర్మిట్ రూంలో కర్రలతో దాడి చేసిన వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఆలేటి రాంరెడ్డి భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆలేటి రాంరెడ్డిపై హత్యాయత్నానికి యత్నించిన అయినపూర్ గ్రామానికి చెందిన నాయిని ప్రతాప్ రెడ్డి, నాయిని యాదిరెడ్డి, రామపురం మహేశ్వర్ రెడ్డి, నాయిని వెంకటరెడ్డిని శుక్రవారం అరెస్ట్ చేసి హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దాడికి ఉపయోగించిన కారును, కర్రలను, 5సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకోని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తరగతి గదిలో కుప్పకూలిన ఉపాధ్యాయుడు

● గుండెపోటుతో సిద్దిపేట జిల్లా పీర్లపల్లిలో టీచర్ మృతి



సోమాచారి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, సంతాపం తెలుపుతున్న ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెబుతూ గుండెపోటుకు గురై కుప్పకూలాడో ఉపాధ్యాయుడు. సార్ ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పగానే, ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. జగదేవ్‌పూర్ మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన కేతోజ్ సోమాచారి(55) పీర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఉదయం పాఠశాలకు వచ్చిన కొద్ది గంటల్లోనే ఛాతీలో నొప్పిగా ఉందని ప్రధానోపాధ్యాయుడు జలేందర్‌రెడ్డికి చెప్పాడు. వెంటనే టీచర్ సోమాచారిని వెంట తీసుకుని జగ దేవ్‌పూర్‌లోని ఓ ప్రైవేట్ క్లినిక్‌కు తీసుకవచ్చారు. గమనించిన వైద్యుడు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో ఉపాధ్యాయుడి సోదరుడు, సీఆర్పీ బాలు కలిసి కారులో హైదరాబాద్ తీసుకువెళ్తుండగా మాదాపూర్ సమీపంలోకి వెళ్లగానే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమాచారి అకాల మరణం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో మాధవరెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, తోటి ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు. సోమచారికి ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడు సిద్ధార్థ్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. నరేష్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. సిద్దార్థ్ వచ్చే నెలలో యూఎస్ వెళ్లడానికి అన్నీ సిద్ధం చేయగా ఈ లోపు విషాదం జరిగింది. శనివారం చెంగిచర్లలో అంత్యక్రియలు జరుగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

అత్యాచార కేసులో యువకుడికి ఏడేళ్ల జైలు

గుమ్మడిదల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల బాలికపై అత్యాచారం కేసులో యువకుడికి పోక్సో చట్టం ప్రకారం ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ సంగారెడ్డి స్పెషల్ పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. ఇందుకు సంబంధించిన వివరాలు శుక్రవారం గుమ్మడిదల ఎస్సై భరత్‌భూషణ్ వివరించారు. గుమ్మడిదల మండలంలోని ఓ గ్రామానికి చెందిన రెండో తరగతి చదువుతున్న బాలిక(7) రోజు సాయంత్రం ట్యూషన్‌కి వెళ్లేది. రోజు మాదిరిగానే 2018 నవంబర్ 18 సాయంత్రం ట్యూషన్‌కి వెళ్లింది. అక్కడ గ్రౌండ్‌ఫ్లోర్‌లో నివాసం ఉంటున్న మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలానికి చెందిన నిందితుడు ఆకుల వీరేశం(అప్పటి వయసు 30) దాదాపు రాత్రి 7.30 గంటల సమయంలో బాలికను తన రూంలోపలికి తీసుకుని వెళ్లి అత్యాచారానికి పాల్పడాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు గుమ్మడిదల పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ అనంతరం, ఏడేళ్ల తర్వాత సంగారెడ్డి జిల్లా స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి జయంతి నిందితుడు ఆకుల వీరేశంకు(37) ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

విద్యుదాఘాతంతో వాటర్‌మెన్ మృతి



మూగ నర్సింలు (ఫైల్)

హవేళిఘణపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గ్రామపంచాయతీ వాటర్ మెన్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలో శుక్రవారం జరిగింది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. హవేళిఘణపూర్ గ్రామానికి చెందిన మూగ నర్సింలు(38) గ్రామ పంచాయతీ వాటర్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విధుల్లో భాగంగా గ్రామ పంచాయతీ బోరుమోటారు కాలిపోయింది. బాగు చేయించి, బోరులో మోటారును దింపి స్టాటర్ డబ్బాలో వైర్లు అమర్చుతుండగా కరెంట్ షాక్ తగిలింది. తీవ్రంగా గాయపడిన నర్సింహులును చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నర్సింలు మరణించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

హవేళిఘణపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం హవేళిఘణపూర్ మండలంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రామాయంపేట మండలం పర్వతాపూర్ గ్రామ పరిధిలోని కిషన్ తండాకు చెందిన దనావత్ శ్రీకాంత్ (21) వ్యవసాయం చేస్తుండేవాడు. ఈ నెల 11న ఇంటి నుంచి మెదక్ వెళ్తుండగా, మండలంలోని శమ్నాపూర్ గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న సిగ్నల్స్‌కు ఢీకొనగా తీవ్ర గాయాలయ్యాయి. మెదక్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని ఓ హస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి దేవులా ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రాజు తెలిపారు.

బోనాల పండగకు కూతురు వద్దకు వెళ్తూ..

● రోడ్డు ప్రమాదంలో నిజాంపేట మహిళ మృతి



గేరుగంటి రేణుక (ఫైల్)

నిజాంపేట, జూలై18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారులోని బాచుపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓమహిళ అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. పట్టణానికి చెందిన గెరుగంటి రేణుక (43) శుక్రవారం మధ్యాహ్నం బస్సులో దిగి.. రోడ్డు దాటుతున్న క్రమంలో ఎదురుగా వచ్చిన కారు బలంగా ఢీ కొట్టింది. దీంతో రేణుక అక్కడికక్కడే మరణించినట్లు కుటుంబీకులు తెలిపారు. రేణుక తన కూతురు బాచుపల్లి ప్రాంతానికి బోనాల ఉత్సవాల కోసం వచ్చి ప్రాణం మీదకు తెచ్చుకుంది. బాచిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ దుకాణంలో పీడీఎస్ బియ్యం పట్టివేత

మనోహరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండల కేంద్రంలో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన రేషన్ డీలర్ అజయ్ కుమార్‌గౌడ్ దుకాణంలో గత నెల 10వ తేదీన రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ టీం అధికారుల సమాచారం మేరకు రేషన్ దుకాణంలో తనిఖీలు చేపట్టారు. దీంతో రేషన్ దుకాణంలో తనకు వచ్చిన కోటా కన్న అదనంగా 19 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని ఆర్ఐ దీక్షత్‌కు అప్పగించారు. దీంతో అతడి దుకాణంలో పరిమితి మించి బియ్యం ఉండటంతో డీలర్ అజయ్ కమార్‌గౌడ్‌పై కేసు నమోదు చేశారు. అలాగే సీజ్ చేసిన బియ్యాన్ని మరొక రేషన్ దుకాణం టేక్మాల్‌కు చెందిన నవనీతకు అప్పగించారని తెలిసింది. ఈ విషయం జరిగి నెల రోజులకు పైగా గడుస్తున్నా మండల రెవెన్యూ సిబ్బంది మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉంది. ఈ విషయం బయటకు చెప్పకపోవడం ఏమిటని ప్రజలు పలు అనుమాలు వ్యక్తం చేస్తున్నారు.

పదేళ్ల తర్వాత మళ్లీ ఆ తండాలో సర్కారు బడి పునఃప్రారంభం

● సంతోషం వ్యక్తం చేస్తున్న గిరిజన వాసులు



తుకారంతండా పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న టీచర్

నర్సాపూర్, జూలై 18(ఆంధ్రజ్యోతి) : పదేళ్ల క్రితం మూతపడిన నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని తుకారాంతండాలో ప్రాథమిక పాఠశాల తిరిగి ప్రారంభమైంది. పిల్లలు సరిగా రావడం లేదన్న కారణంతో గతంలో రద్దయిన ఈ పాఠశాల, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మళ్లీ మొదలైంది. దీంతో స్థానిక గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తుకారాంతండా నర్సాపూర్ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. గతంలో ఐదో తరగతి వరకు బోధన జరిగే ఈ పాఠశాల మూతపడగా, తర్వాత పిల్లలు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సాపూర్ పట్టణంలో చదువుకోవాల్సి వచ్చేది. గతంలో రద్దయిన పాఠశాలలను తిరిగి పునరుద్ధరించే కార్యక్రమంలో భాగంగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో తుకారాంతండాలో మళ్లీ పాఠశాలను ప్రారంభించారు. ప్రస్తుతం ఐదు తరగతుల వరకు బోధన జరుగుతున్న ఈ పాఠశాలలో మూడు రోజుల క్రితమే తరగతులు మొదలయ్యాయి. సమీపంలోని కాగజ్‌మద్దూర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయురాలిని తాత్కాలికంగా డిప్యూటేషన్‌పై కేటాయించారు. ఇప్పటికే 15 మంది విద్యార్థులు చేరారు. తమ తండాలోనే పాఠశాల తిరిగి ప్రారంభం కావడంతో చిన్న పిల్లలు ఐదో తరగతి వరకు అక్కడే చదువుకునే అవకాశం లభించిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

నాచగిరి క్షేత్రం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ పునరుద్ధరణ

ఆలయం వద్ద ధర్మకర్తల మండలి తొలి సమావేశం

వర్గల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నాచగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్ పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తా వెల్లడించారు. శుక్రవారం ఆలయం వద్ద ధర్మకర్తల మండలి సభ్యులతో జరిగిన మొదటి సమావేశంలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఈ సమావేశంలో చర్చించారు. గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్ పునరుద్ధరణకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వానికి పంపించనున్నట్లు చైర్మన్ తెలిపారు. ఆలయం వద్ద పనిచేస్తున్న సీసీ కెమెరాలతో పాటు అదనంగా మరికొన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సిబ్బంది సమయపాలన పాటించేందుకు బయోమెట్రిక్ అటెండెన్స్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఈవోకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు, ధర్మకర్తల మండలి సభ్యులు జగ్గయ్యగారి శేఖర్, దేశపతి ఉషశ్రీ, గాలి కిష్టయ్య, కొత్తపల్లి శ్రీనివాస్, జగ్గన్నగారి సురేందర్ రెడ్డి, తిరుమలరావు, రుద్ర శ్రీహరి, చందా నాగరాజు, జగన్నాథచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహ్మదాపూర్ యువకుడికి డాక్టరేట్

● గవర్నర్ చేతుల మీదుగా అందుకున్న అసిస్టెంట్ ప్రొఫెసర్



మధుకు డాక్టరేట్ పట్టా అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవవర్మ(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామానికి చెందిన రావుల మధు, ఈనెల 16న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవవర్మ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన రావుల కనుకయ్య, భారతవ్వల కుమారుడైన మధు, గత పదేళ్లుగా కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్ వాసం చంద్రశేఖర్ పర్యవేక్షణలో మధు పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈనెల 16న డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో జరిగిన రెండవ స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవవర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా మధుకు డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. మధు డాక్టరేట్ సాధించడం పట్ల మహ్మదాపూర్ గ్రామ ప్రజలు, బంధువులు అభినందించారు.



మేకపిల్లను గావ్‌పట్టడం తిలకిస్తున్న భక్తజనం, అమ్మవారి ఆలయం వద్ద భక్తులు

సదాశివపేటలో వైభవంగా దుర్గమ్మ జాతర

అశేష భక్తజనం మధ్య పచ్చికుండ బోనం ఊరేగింపు

సదాశివపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసంలో పది రోజుల పాటు సాగిన సదాశివపేట దుర్గమ్మ మహాజాతర ఉత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ముగిశాయి. హైదరాబాద్ బోనాల తర్వాత ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఈ జాతరకు ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి వేలాది భక్తులు తరలివచ్చారు. వందల ఏళ్ల నాటి ఆనవాయితీ మేరకు నిర్వహించిన పచ్చికుండ బోనం ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. గడీల ప్రసాద్‌గౌడ్ బోనాన్ని నెత్తిన పెట్టుకుని అమ్మవారికి సమర్పించారు. ఒంటినిండా పసుపు పూసుకున్న నదర్‌లింగమయ్య, ఒంటి నిండా కుంకుమ పూసుకున్న పోతరాజుల విన్యాసాలు భక్తులను ఉర్రూతలూగించాయి. పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కల్లుపోతు ఊరేగింపులో డప్పుల దరువులు, డీజే సౌండ్‌లతో పురవీధులు దద్దరిల్లాయి. నదర్‌లింగమయ్య, పోతరాజులు మేక, గొర్రెపిల్లలను గావ్ పట్టడంతో ఉత్సవాలు ముగిశాయి.




కలుపు యంత్రంతో చకచకా

కంది మండలం కాశీపూర్ గ్రామంలో రైతు ఎండీ రజాక్ రైతుల కొరతను అధిగమించేందుకు కలుపు యంత్రాన్ని తయారు చేశాడు. ఆ యంత్రం సాయంతోనే తన మూడు ఎకరాల భూమిలో రెండు గంటల సమయంలోనే కలుపు తీస్తున్నాడు. దీనికి మూడు లీటర్ల పెట్రోల్ ఖర్చవుతుందని, మెషీన్‌కు రూ.40 వేలు వెచ్చించినట్టు రజాక్ తెలిపారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి జిల్లా

సుందరకాండ పుస్తకమే పెళ్లిపత్రిక



రామయణ సుందరకాండ పుస్తకం, అందులోని పెళ్లి పత్రిక

నారాయణఖేడ్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వివాహాలకు ఆహ్వానించడానికి ఆర్భాటంగా భారీ ఖర్చుతో పెళ్లి పత్రికలను వేసి తమ గొప్పతనాన్ని చాటుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. కానీ, కామారెడ్డి జిల్లా పిట్లంకు చెందిన కోట రాజులు, నాగరాణి దంపతులు వినూత్నంగా సుందరకాండ పుస్తకంపై పెళ్లి పత్రికను ముద్రించి బంధుమిత్రులను ఆహ్వానిస్తున్నారు. ఆగస్టు 6న పిట్లంలో కోట నాగరాణి, రాజుల కొడుకు రవిచంద్ర వివాహం నందినితో జరగనుంది. ఇందుకు సంబంధించిన పెళ్లి పత్రికను శుక్రవారం నారాయణఖేడ్‌లోని వారి బంధుమిత్రులకు అందజేశారు. సుందరకాండ ప్రాముఖ్యతను ప్రతీ ఒక్కరికి తెలియాలని, ప్రతీ ఇంటిలోనూ ఈ పుస్తకం ఉండాలనే సంకల్పంతో ఈ ఆలోచన చేసినట్లు వారు పేర్కొంటున్నారు. వెయ్యి పత్రికలను పంపిణీ చేసినట్లు తెలిపారు. వారి ఆలోచనను పలువురు ప్రశంసిస్తున్నారు.



నిరుపయోగంగా సమీకృత మార్కెట్

తూప్రాన్‌లో కోట్లు వెచ్చించి నిర్మాణం

ఖాళీగా షెట్టర్లు, స్టాళ్లు

తూప్రాన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో అధునాతన వసతులతో నిర్మించిన సమీకృత మార్కెట్ (వెజ్, నాన్‌వెజ్) నిరుపయోగంగా మారింది. ప్రారంభమైన కొద్ది రోజుల నుంచే షెటర్లు, స్టాళ్లు ఖాళీగా ఉండగా, ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతోంది.

గజ్వేల్ తరహాలో తూప్రాన్‌లోనూ సమీకృత మార్కెట్‌ను అప్పటి సీఎం కేసీఆర్ మంజూరు చేశారు. ఇందుకు మార్కెటింగ్‌శాఖ రూ.4.50 కోట్లు, గడ ప్రత్యేక నిధులు రూ.5.80 కోట్లు మంజూరు చేయగా 2022లో మార్కెట్ నిర్మాణం పూర్తి చేశారు. గడ ప్రత్యేక నిధులు రూ.60 లక్షలతో లిఫ్ట్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో కమర్షియల్ (వాణిజ్య) దుకాణాలు 20, కూరగాయల స్టాళ్లు 28, కార్యాలయ గది, కోల్డ్‌స్టోరేజీ గది, క్యాంటీన్, ఎలక్ట్రికల్ గది, టాయిలెట్‌లను నిర్మాణం చేశారు. ఫస్ట్ ఫ్లోర్‌లో మటన్ స్టాళ్లు 24, చికెన్ స్టాళ్లు 22, చేపల స్టాళ్లు 8, చేపలు శుభ్రపరిచే స్థలం, టాయిలెట్లు నిర్మాణం చేశారు. సెకండ్‌ఫ్లోర్‌లో కమర్షియల్ స్థలాలు (సూపర్ మార్కెట్, బంకెట్ హాల్, బ్యాంకు), టాయిలెట్, టెర్రస్‌లో నీటిశుద్ధి ప్లాంటు, వాటర్‌ట్యాంకు ఏర్పాటు చేశారు. 2022 సెప్టెంబర్ 2న అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రారంభోత్సవం చేశారు. ప్రారంభోత్సవం చేసిన కొద్దిరోజులు వ్యాపారులు అక్కడే కూరగాయలు, చికెన్, మటన్ అమ్మకాలు చేశారు. అయితే, వ్యాపారం సక్రమంగా సాగడంలేదంటూ ఒక్కొక్కరుగా పాత దుకాణాల వద్దకు వెళ్లారు. మాంసం దుకాణాలు సైతం ఒక్కొక్కటిగా రోడ్డు పక్కన బహిరంగ మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో దుకాణాలు, స్టాళ్లు 96 ఉండగా, ప్రస్తుతం ఓ చికెన్ దుకాణం, రెండు కూరగాయల దుకాణాలు, ఒక కూరగాయల స్టాల్‌తో నాలుగు దుకాణాలే కొనసాగుతున్నాయి. వ్యాపారం ఎక్కువగా సాగకపోవడంతో దుకాణాలు నిర్వహిస్తున్న ఒకరిద్దరు అద్దెలు చెల్లింపులు చేయడంలేదు.



దుమ్ము పట్టిన చికెన్, మటన్ స్టాళ్లు

కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన ఈ మార్కెట్ ప్రస్తుతం దుమ్ము, ధూళితో నిండిపోయి, దుర్వాసన వెదజల్లుతోంది. టాయిలెట్లు శుభ్రం చేయకపోవడం, తాగునీటి వ్యవస్థ పనిచేయకపోవడంతో అధ్వానంగా మారింది. అంతేకాకుండా, కొనుగోలుదారుల కోసం నిర్మించిన భారీ పార్కింగ్ స్థలం ఇప్పుడు వాహనదారులకు శాశ్వత పార్కింగ్ ప్రదేశంగా మారింది. రాత్రి పూట కార్ల పార్కింగ్ ఎక్కువగా జరుగుతోంది.



దుకాణాలన్నీ ఉంటే వ్యాపారం బాగా సాగుతుంది

తూప్రాన్ సమీకృత మార్కెట్‌లో దుకాణాలు లేకపోవడంతో వ్యాపారం సాగడంలేదు. ఏదో కొద్దిపాటి వ్యాపారం జరుగుతుంది. దుకాణాలన్నీ ఇక్కడే ఉంటే మంచి వ్యాపారం సాగుతుంది. మొదట్లో వ్యాపారం బాగానే సాగింది. దుకాణాలన్నీ ఊర్లోకి వెళ్లడంతో ఇక్కడికి వచ్చేవారు తక్కువయ్యారు.

- స్వరూప, కూరగాయల స్టాల్ వ్యాపారి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

● ప్రజలతో సంబంధాలున్న అభ్యర్థుల ఎంపిక

● కరీంనగర్ ఎంపీ బండి సంజయ్

అక్కన్నపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ అధిక స్థానాల్లో గెలిచేందుకు కృషి చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం జనగామ జిల్లా పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో అక్కన్నపేటలో ఆగి బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలతో ఎక్కువ సంబంధాలు కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఏఏ గ్రామాల్లో అభివృద్ధి పనులు, కమ్యూనిటీ హాళ్లు, సీసీ రోడ్లు కావాలో జాబితా తయారుచేసి ఇస్తే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి, నాయకులు చెరుకు సంపత్, నూనవత్ మోహన్‌నాయక్, జంగపల్లి శ్రీనివాస్, జన్నారపు కళ్యాణ్‌విష్ణు, దూలం మల్లేశం, వంగల భాస్కర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, చాడ శ్రీనివాసరెడ్డి, కాశబోయిన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అక్కన్నపేటలో బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాల్సిందే

కొత్త విషయాలు నేర్చుకోవాలి

సామాజిక మార్పులకనుగుణంగా మారాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మీడియా, రాజకీయ రంగాల్లోని వారు నిత్యం సామాజిక మార్పులకు, అవసరాలకనుగుణంగా తమని తాము తీర్చిదిద్దుకోవాలని, ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్కింగ్ జర్నలిస్టుల పునశ్చరణ శిక్షణ తరగతుల ప్రారంభ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సామాజిక అంశాలపై జర్నలిస్టులు ఫోకస్ చేయాలన్నారు. ప్రభుత్వాన్ని కదిలించే విధంగా ప్రజలకు అవసరమయ్యేలా కథనాలు రాయాలన్నారు. జర్నలిస్టులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించే విషయంపై అసెంబ్లీలో చర్చిస్తానని హామీ ఇచ్చారు. సిద్దిపేట జర్నలిస్టులకు తన సొంత డబ్బు రూ.10 లక్షలతో బీమా సౌకర్యం కల్పిస్తానని ప్రకటించారు. అంతకుముందు మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వార్తల సేకరణలో సామాజిక ప్రభావం వంటి అంశాలు పూర్తిగా కొత్త రూపం దాల్చాయన్నారు. సాంకేతికతను సమగ్రంగా తెలుసుకుంటే వార్తలు సేకరణ సులభం అవుతుందని సూచించారు. త్వరలోనే మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఏఐ అనే అంశంపై సెమినార్ వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, సీనియర్ సంపాదకులు ఆర్వీ రామారావు విలేకరులనుద్దేశించి ప్రసంగించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరీశ్‌రావు

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

● ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్

జహీరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కృషి అమోఘమని జహీరాబాద్ ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మహిళా శక్తి సంబురాలు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సమాజంలో మహిళా సంఘాల సభ్యులు పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులు, క్యాంటీన్ల నిర్వహణ, అల్లికలు, కుట్లు వంటి రంగాల్లో రాణిస్తూ పదిమందికి ఉపాధి కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పించిన నేపథ్యంలో, ఇక్కడి ఆడబిడ్డలు కూడా అందులో ఉండాలని కోరుకున్నారు. జహీరాబాద్ నియోజకవర్గానికి వచ్చే ఐదేళ్లలో పెద్ద మొత్తంలో ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అందులో భాగంగా నియోజకవర్గంలోని ఆయా మండలాలకు సంబంధించిన మహిళా సంఘాల సభ్యులకు వివిధ పథకాల కింద సుమారు రూ.46 కోట్ల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐడీసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, డీఆర్డీవో పీడీ జ్యోతి, అదనపు పీడీ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



మహిళాసంఘాల సభ్యులకు చెక్కులను అందజేస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

ఆదర్శ ఉపాధ్యాయులు

● పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన టీచర్లు

● ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్య అందుతుందనే భరోసా కల్పన

మెదక్, కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నేటి రోజుల్లో విద్యకు ఉన్న విలువ అంతా ఇంతా కాదు. ఇదే అదనుగా ప్రైవేటు పాఠశాలలు ఇంటర్నేషనల్ సిలబస్, ఐఐటీ, నీట్ కోచింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అంటూ ప్రచార ఆర్భాటంతో పట్టణాలతో పాటు మారుమూల పల్లెల్లోనూ హోరెత్తిస్తున్నాయి. తల్లిదండ్రులను ఆకట్టుకుంటూ లక్షలాది రూపాయల ఫీజులు దండుకుంటున్నాయి. నాణ్యమైన విద్య అందుతుందనే నమ్మకంతో కొందరు, గొప్పలకు పోయి మరికొందరు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేరుస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చదివిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులు జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో చేర్చగా, మరికొందరు తాము పనిచేసే పాఠశాలల్లోనే చదివిస్తున్నారు. ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాలలే ఉత్తమమంటూ ఆచరణలో చూపిస్తున్న ఉపాధ్యాయుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఘనపూర్ పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ రజని తన పిల్లలను అదే పాఠశాలలో చేర్చారు. కొడిపల్లి మండలంలోని అవుసులపల్లి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ తన పిల్లలను ఘనపూర్ ప్రభుత్వ పాఠశాలలో చేర్చారు. అలాగే, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు దేవుల కూడా తన పిల్లలను ఘనపూర్ పాఠశాలలో చేర్చి అందరికీ ఆదర్శంగా నిలిచారు.



ప్రధానోపాధ్యాయుడి చేతుల మీదుగా తమ పాఠశాలలో చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు మొహమ్మద్ అలీ అక్బర్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నేను మెదక్ జిల్లా కేంద్రంలోని న్యూ హై స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా గణితాన్ని బోధిస్తున్నాను. నా కుమారుడు జావేద్ అలీని ఎనిమిదో తరగతిలో నేను పని చేసే పాఠశాలలోనే చేర్చాను. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి.

- మొహమ్మద్ అలీ అక్బర్, స్కూల్ అసిస్టెంట్, న్యూ హైస్కూల్, మెదక్

ప్రభుత్వ పాఠశాలలపై భరోసా కల్పించడమే లక్ష్యం



ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో, నేను పని చేసే కూచన్‌పల్లి పాఠశాలలో నా ఇద్దరు పిల్లలైన కీర్తి ప్రియ (9వ తరగతి), అమర్త్య (6వ తరగతి)ని చేర్చాను. ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలల పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారు. కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య లభిస్తుందనే నమ్మకాన్ని కలిగించాలంటే, ముందుగా మనమే ఆచరించాలని భావించి నా పిల్లలను మా పాఠశాలలో చేర్చాను.

- శశికుమార్, తెలుగు పండిత్, కూచన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల

న్యూస్ బాక్స్

అరుణాచలానికి ఏసీ బస్సులు

రామచంద్రాపురం టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం బెల్ ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం తీర్థయాత్ర చేయడానికి ప్రత్యేకంగా ఏసీ బస్సులు నడిపిస్తున్నట్లు మేనేజర్ సుధ తెలిపారు. ఈ నెల 25, ఆగస్టు 8 14, 15 తేదీల్లో ప్రత్యేకంగా రాజధాని ఏసీ బస్సులు వేస్తున్నామని చెప్పారు. రానుపోను రెండు వైపులా ఖర్చులు రూ. ఐదు వేలు అవుతుందని తెలిపారు. ముందుగానే టిక్కెట్లు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని కోరారు.ఈ నెల 26న భద్రాచలానికి రానుపోను టికెట్ ధర రూ.1700., కాళేశ్వరానికి రూ.1,200, ఏసీ బస్సుకు రూ.1600 ఉంటుందని తెలిపారు. 30 మంది భక్తులు ఉంటే ఇంటి వద్దకే బస్సు పంపుతామని పేర్కొన్నారు. టికెట్లు కావాల్సిన వారు డీఎన్ భూషణం 9391072283, రమేష్ 9063401072 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నారాయణఖేడ్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ డబ్బులను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేజీ టూ పీజీ విద్యను అందిస్తామని చెప్పినప్పటికీ, విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రైవేటీకరణ కోసం ప్రోత్సహించిందన్నారు. గత విద్యార్థులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చైతన్య, నాయకులు దత్తురెడ్డి, అశోక్, సతీష్, ప్రతాప్‌రెడ్డి, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు కేజీబీవీ బాలికల డిశ్చార్జ్

సంగారెడ్డి అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న ఐదుగురు విద్యార్థినిలు దగ్గుతో స్వల్ప అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వీరిని సంగారెడ్డిలోని ఎంసీహెచ్ ఆసుపత్రి పీడియాట్రిక్ వార్డులో ఉంచి చికిత్స అందించగా, నలుగురి ఆరోగ్యం సాధారణ స్థితికి రావడంతో శుక్రవారం డిశ్చార్జ్ చేశారు. మరొక్కరిని శనివారం డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

సంగారెడ్డి అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం. యాదగిరి కోరారు. వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులకు మూడు నెలల వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే చెల్లించాలన్నారు. కాంట్రాక్టు వ్యవస్థ పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు, మల్లేశం, వినోద్, ప్రవీణ్, నర్సింహులు, విజయ్, రాజు పాల్గొన్నారు.

గురుకులాల్లో టైమ్ టేబుల్ మార్చండి: యూటీఎఫ్

సంగారెడ్డి రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో టైమ్ టేబుల్ మార్చాలని, ఉపాధ్యాయులకు పదోన్నతుల షెడ్యూల్ ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను శుక్రవారం యూటీఎఫ్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురుకులాల్లో విద్యార్థులను ఒత్తిడికి గురిచేసేలా టైమ్ టేబుల్ ఉందని, విద్యార్థుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని వెంటనే టైమ్ టేబుల్ మార్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ పథకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం మండల ఉపాధ్యక్షుడు బస్వరాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీశైలం


శ్రీశైలం

పుల్కల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండల కురుమ సంఘం అధ్యక్షుడిగా శివంపేట గ్రామానికి చెందిన మిరియాల శ్రీశైలం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శివంపేటలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా మాణిక్యం, ప్రధాన కార్యదర్శిగా సుభాష్, సహాయ కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా రాజు, సలహాదారుగా మల్లేశం, యువజన విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా నర్సింహులు, సురేష్ ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర నాయకుడు నగేష్, జిల్లా అధ్యక్షుడు గూడెం మల్లయ్య సమక్షంలో జరిగాయి.



చెరువు కాదు.. రోడ్డే!

వట్‌పల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వట్‌పల్లి మండల కేంద్రం గుండా వెళ్లే అల్లాదుర్గం - మెటల్ కుంట అంతర్ రాష్ట్ర ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. సుమారు 20 కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షం వచ్చినా రహదారిపై నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ఖేడ్‌లో గడికట్ట మైసమ్మ బోనాలు


ఖేడ్‌లో గడికట్ట మైసమ్మ బోనాలు తీస్తున్న మహిళలు

నారాయణఖేడ్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాస ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలోని శాస్త్రీనగర్‌లో గడికట్ట మైసమ్మ ఆలయం ఆవరణలో అమ్మవారి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వివిధ కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు పలు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు పెద్ద ఎత్తున బోనాల ఊరేగింపు నిర్వహించి, అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులు ఎలాంటి ఇబ్బందులు పలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌కు మతిభ్రమించింది

● మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో ఎన్నడూ గెలవని మీరు ప్రజలకు సంబంధం లేని విషయాలు మాట్లాడుతున్నారని తెలిపారు. కేసీఆర్, హరీ‌ష్‌రావులను తిట్టడంలో ఉన్న శ్రద్ధ రైతులకు యూరియా అందించడంలో చూపాలని పేర్కొన్నారు. సింగూరు నుంచి తమ వాటాగా ఉన్న 0.4 టీఎంసీల నీటిని ఘనపురం ఆయకట్టుకు విడుదల చేయించాలని పేర్కొన్నారు. మెదక్‌లో కార్యక్రమానికి వచ్చిన మహేష్‌కుమార్‌గౌడ్, ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామిలు జిల్లాకు ఏం చేయబోతున్నారో చెప్పకుండానే వెళ్లిపోవడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. మైనంపల్లి ఉడత ఊపులకు ఇక్కడెవరూ బయపడేవారు లేరని, 19 నెలల కాలంలో చేసిన అభివృద్ధిపై చర్చకు తాము ఎప్పుడూ సిద్ధమేనని పేర్కొన్నారు.

మెదక్‌ను అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే

మనోహరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మెదక్‌ను అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, మెదక్‌లో నిర్మించిన భవనాలకు రంగులు కూడా వేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం మెదక్ వెనుకబడిందని అనడం సిగ్గుచేటు అని మెదక్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకాల హేమాలతశేఖర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని తమ నివాసంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ అప్పులు చేసి అభివృద్ధికి ఖర్చు చేసిందని, మీరు ఏ పని చేయాలన్నా ప్రతి నెలా ఢిల్లీకి మూటలు కట్టుకొని పోవాలన్నారు. మండల బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు రతనలాల్, ఆత్మకమిటీ చైర్మన్ భిక్షపతి, వెంకటేష్, నవీన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

జిన్నారం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గడ్డపోతారం మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మంత్రికుంటలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య తదితరులు హాజరై మొక్కలు నాటారు. అంతకుముందు కమిషనర్ మున్సిపల్ సిబ్బందితో ప్రణాళిక అమలుపై సమీక్ష నిర్వహించారు.

నూతన ఆవిష్కరణల కోసం కృషి చేయాలి

● సంగారెడ్డి డీఈఓ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సంగారెడ్డి డీఈఓ వెంకటేశ్వర్లు సూచించారు. సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో శుక్రవారం ఇన్‌స్పైర్ నామినేషన్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఐడియా బాక్స్‌లు ఏర్పాటు చేసుకొని దాని ప్రాముఖ్యతను తెలియజేస్తూ, సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం దిశగా నూతన ఆవిష్కరణలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సీఎంఓ వెంకటేశం, ఏఎంఓ బాలయ్య, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, ఎంఈఓ జాకీర్‌హుస్సేన్, రవీందర్‌రెడ్డి, భాస్కర్, వెంకటేశం, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన డీఈవో


పాఠశాలను పరిశీలిస్తున్న డీఈవో

శివ్వంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు పాఠశాలల్లోనే ఉంటుందని, విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా విద్యాధికారి రాధా కిషన్ పేర్కొన్నారు. శుక్రవారం శివ్వంపేటలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి, తరగతుల నిర్వహణ, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల సుందరీకరణ పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బుచ్చ నాయక్, కాంప్లెక్స్ హెచ్ఎం బాలచంద్రం పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

కంది, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ జూలకంటి ఆంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం కంది మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కంది గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సాయిబాబాను నియమించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమక్షంలో అసెంబ్లీ కన్వీనర్ జూలకంటి ఆంజనేయులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్‌లు సాయిబాబాకు నియామక పత్రాన్ని అందజేశారు.

మురుగు సమస్యలకు పరిష్కారం: కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో మురుగు సమస్యలు లేకుండా పరిష్కారం చేస్తున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి కాకతీయనగర్ కాలనీలో మురుగు పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. జలమండలి మేనేజర్ లోకేష్‌నాయక్, అమృతసాగర్, నరేంద్రబాబు, రాములు, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్రావు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను అప్పగించాలి

● బీఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హోతి(కే) శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూమ్‌లను బీఆర్ఎస్ హయాంలో లబ్ధిదారులను ఎంపిక చేసి సర్టిఫికెట్లు అందజేసినప్పటికీ, అధికారులు వివిధ కారణాలు చూపి తాళం చేతులు ఇవ్వకపోవడం తగదని బీఆర్ఎస్ నాయకులు నామకిరణ్, బండి మోహన్, యాకూబ్, పురుషోత్తంరెడ్డి, శివప్ప, గణేష్, నర్సింహారెడ్డి తదితరులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గత రెండేళ్ల కిందటే అందజేసిన డబుల్ బెడ్రూమ్‌లపై విచారణ చేపట్టడమేంటని ప్రశ్నించారు. లబ్ధిదారులకు అన్యాయం జరిగితే సహించబోమని, త్వరలో తాళం చేతులు ఇవ్వకపోతే తామే లబ్ధిదారులను వెంట తీసుకువెళ్లి ఇళ్లల్లో కూర్చోబెడతామన్నారు. అవసరమైతే జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేపడతామన్నారు.

తహసీల్దార్‌కు విన్నవించిన బీజేపీ

జహీరాబాద్ పట్టణంలోని హోతి(కే)లో నిర్మితమైన డబుల్ బెడ్రూమ్‌లను లబ్ధిదారులకు అప్పగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ దశరథ్‌కు వినతిపత్రం అందజేశారు. సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులందరికీ డబుల్ బెడ్రూమ్‌లను అప్పగించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పూల సంతోష్, శ్రీనివాస్‌గుప్త, సంతోష్, అప్పంశ్రవణ్, అరుణ్‌కుమార్, విశ్వనాథ్, జీవనజైన్, రాఘవేందర్‌నాయక్, రమేష్, శోభారాణి పాల్గొన్నారు.

పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు : ఆర్డీవో



సదాశివపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో కాలుష్య రహిత పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు మొగ్గు చూపుతోందని, దీంతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సదాశివపేట మండలం ఆరూర్ గ్రామ శివారులోని సర్వే నెంబర్లు 224, 263, 268లలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు అవసరమైన భూమిని రైతుల నుంచి సేకరించేందుకు గ్రామ రైతులతో ప్రజాభిప్రాయ సమావేశం నిర్వహించారు. ఎకరాకు దాదాపు రూ.80 లక్షల పరిహారం ఇస్తే మరోచోట కొంత భూమిని కొనుగోలు చేస్తామని, మా కుటుంబాలు కూడా రోడ్డున పడకుండా పిల్లల చదువులు, భవిష్యత్తు అవసరాలు తీరి తమకు న్యాయం జరుగుతుందని రైతులు ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తహసీల్దార్ కె. సరస్వతి, డిప్యూటీ తహసీల్దార్ బాల్‌రాజ్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్, ఆర్ఐ గంగాధర్, తాజా మాజీ సర్పంచ్ నాయికోటి మధు, మాజీ ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

కొండాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సంగారెడ్డి నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గంగారంలో ఎంపీడీఓ సత్తయ్యతో కలిసి ఇందిరమ్మ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు ప్రొసిడింగ్ అందజేసి, ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు.


ఇంటి పనులను పరిశీలిస్తున్న ఆత్మకమిటీ చైర్మన్

ఏసీబీ.. దూకుడు

(3వ పేజీ తరువాయి)

ఏదో ఒక అభ్యంతరం పెట్టి నెలలు, సంవత్సరాల పాటు అధికారులు పెండింగ్‌లోనే పెడుతున్నారు. లంచం ఇవ్వలేక కొందరు నిజాయితీపరులు తమ పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయి చివరకు ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు.

నిర్భయంగా ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ శాఖల్లో అవినీతి నిర్మూలన కోసం అందరూ సహకరించాలి. అవినీతి నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత. ప్రజల్లో చైతన్యం వస్తేనే అవినీతి నిర్మూలన సాధ్యమవుతుంది. అవినీతి రహిత సమాజం కోసం అటు ప్రభుత్వ ఉద్యోగులు, ఇటు ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అవినీతి నిర్మూలన కోసం విస్తృత ప్రచారం చేస్తున్నాం. జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో పోస్టర్లు వేయించాం. ముఖ్యంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే ఏసీబీ శాఖను సంప్రదించాలి. అవినీతిపై సమాచారం ఇచ్చేందుకు 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదుదారుడి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

-సుదర్శన్, ఏసీబీ డీఎస్పీ

'పీఎం-ఉషా'తో మహర్దశ

(3వ పేజీ తరువాయి)

డ్యుయల్ డెస్కులు సమకూర్చారు. నిర్మాణ పనులు పూర్తయితే అన్ని రకాల హంగులతో కార్పొరేట్ స్థాయిలో డిగ్రీ విద్య అందనుంది. పీఎం-ఉషా పథకంతో కళాశాలకు మహర్దశ పట్టనుంది.

మారనున్న కళాశాల రూపురేఖలు

పీఎం ఉషా కింద మంజూరైన నిధులతో చేపట్టే పనుల ద్వారా కళాశాల రూపురేఖలు మారనున్నాయి. వసతులు, సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. విద్యార్థినీలకు కార్పొరేటుకు దీటుగా విద్యాబోధన అందనుంది. స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుతో విద్యార్థినీలకు స్వయం ఉపాధి అవకాశాలు దక్కుతాయి. విద్యార్థినీలు ఉజ్వల భవిష్యత్తుగా మార్గం సుగమం అవుతుంది. తరగతి, హాస్టల్ గదుల నిర్మాణాలు నాణ్యతగా జరిగేలా పర్యవేక్షిస్తాం.

-అరుణబాయి, ప్రిన్సిపాల్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి


పెద్దశంకరంపేటలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

పెద్దశంకరంపేట/నారాయణఖేడ్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని స్త్రీ శక్తి భవనంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. అనంతరం పేటలోని కేజీబీవీ, మోడల్ స్కూల్, పాఠశాల, కళాశాలలను ఆయన సందర్శించి, కేజీబీవీ పాఠశాలలో అదనపు తరగతి గదులు, టాయిలెట్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్‌లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రిన్సిపల్, సిబ్బంది ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. అలాగే ఖేడ్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ గెర్గాన తండా వద్ద రోడ్డు, వాగుపై వంతెనకు నిధులు మంజూరు చేయించినా కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా అంచనాలను పెంచి మళ్లీ టెండర్లు పిలవనున్నారని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ వెంకటేశం, కేజీబీవీ, మోడల్ పాఠశాలల ప్రిన్సిపాల్స్ విజయ, శ్రీలత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయిని మధు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మున్సిపల్ తాజామాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, నాయకులు ఖేడ్ పట్టణంలోని శాస్త్రీనగర్ కాలనీలో గడి మైసమ్మ ఆలయంలో నిర్వహించిన గడి మైసమ్మ ఆషాఢ బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన ప్రభుత్వంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 260 మంది లబ్ధిదారులకు రూ.1.50 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రోహిత్‌రావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులు తెచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొజ్జ పవన్, శ్రీనివాస్ చౌదరి, దేమే యాదగిరి పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం



విద్యార్థులకు నగదు పురస్కారం అందజేసిన మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి

రామచంద్రాపురం టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం ప్రభుత్వ గీతాభూపాల్‌రెడ్డి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు భూమి ఆకాశం ఓర్పనేజ్ ట్రస్టు, క్లాస్‌మేట్ క్లబ్‌ల ఆధ్వర్యంలో నగదు పురస్కారాలు అందజేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులను నిత్యం ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శరెడ్డి, కార్పొరేటర్ పుష్పానగేష్, ప్రకాష్, ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాల్‌రెడ్డి, మాజీ గ్రంథాలయం చైర్మన్ కుమార్‌గౌడ్, శ్రీధర్, జగన్నాథరెడ్డి, విష్ణువర్ధనరెడ్డి, సత్యనారాయణ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : జడ్పీ సీఈవో


రంగంపేటలో మద్యనబోజనం తనిఖీ చేస్తున్న జడ్పీ సీఈవో

కొల్చారం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొల్చారంలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. శుక్రవారం రంగంపేట పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు విద్య, క్రీడలతో సహా అన్ని రంగాలలో ముందుకు సాగాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌తో విద్యుత్ సమస్యలు దూరం


తిమ్మాపూర్ శివారులో స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు

నారాయణఖేడ్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణ సమీపంలోని మనూరు మండలం తిమ్మాపూర్ శివారులో 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణంతో ఖేడ్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో విద్యుత్ సమస్యలు దూరమవుతాయని ట్రాన్స్‌కో మేడ్చల్ జోన్ సీఈ కామేష్ అన్నారు. పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఎస్ఈ శ్రీనాథ్, జోగిపేట డీఈ శ్రీనివాస్, కన్‌స్ట్రక్షన్స్ ఏడీఈ మహేష్, సివిల్ ఈఈ రవికాంతరెడ్డి, ఖేడ్ ఏడీఈ నాగిరెడ్డి, ఏఈలతో కలిసి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. తిమ్మాపూర్‌లో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణంతో ఖేడ్ పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ అందుతూ సమస్యలు తీరుతాయన్నారు. వెంటనే పనులను ప్రారంభించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.